

ఏడాదంతా గుర్తుంటాయి



రామగుండం: సద్దుల బతుకమ్మ పండుగ అంటేనే ఆటపాటలతో అందరితో ఆనందంగా గడిపే క్షణాలు. అత్తాగారింటి నుంచి తల్లిగారింటికి వచ్చిన తర్వాత చిన్నప్పటి స్వేచ్ఛ లభిస్తుంది. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లతో కలిసి గడిపే క్షణాలు ఏడాదంతా గుర్తుండిపోతాయి. – దాసు త్రివేణి, ఇందిరమ్మకాలనీ, రామగుండం

తల్లిగారింట్లోనే సద్దులు



రామగుండం: నాకు గతేడాది వివాహమైంది. సద్దుల బతుకమ్మ వేడుకలు మాత్రం తల్లిగారింట్లోనే. ఏ పండుగైనా అత్తారింట్లో చేసుకున్నప్పటికీ సద్దుల బతుకమ్మకు తల్లిగారింటికి చేరాల్సిందే. బతుకమ్మ ఆటపాటలతో సంబురంగా అనిపిస్తుంది. – శ్రీలేఖ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రామగుండం

ఇప్పటోళ్లకు ఆడుడే రాదు



రామగిరి: నాడు బతుకమ్మ ఆట మొదలుపెట్టి గంటల తరబడి ఆడుకునేది. వాడోళ్లందరం చప్పట్లు కొడుతూ పాటలు పాడేటోళ్లం. భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకునేది. ఇప్పుడు ఎక్కడ చూసినా డీజే పాటలు పెట్టుకుని ఎగురుతున్నారు. ఇప్పటోళ్లకు ఎగురుడు తప్ప ఆడుడు రాదు. – సారమ్మ, నవాబ్‌పేట

క్లుప్తంగా

ఉన్నత శిఖరాలకు ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని శ్రీవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్‌లో శ్రీవాణి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ, మాజీ ప్రిన్సిపాల్ పూరెల్ల సదానందం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ఖని’ అధ్యాపకుడికి డాక్టరేట్



జీడి కనకయ్య

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకుడు జీడి కనకయ్యకు ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించినట్లు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఉమెన్ పొలిటికల్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ పంచాయతీరాజ్–పర్సెప్షన్ అండ్ పర్ఫామెన్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్–ఏ స్టడీ అనే అంశంపై డాక్టర్ టీవీ సుజాత కుమారి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. కేయూ డాక్టరేట్ ప్రకటించడంపై కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య, అధ్యాపకులు కనకయ్య అభినందించారు.

కళాశాలలో ఫ్రెషర్స్ డే హంగామా

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అధ్యాపకులు వెంకటేశ్, పవన్, సరేశ్, మహేందర్, లైబ్రేరియన్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న సంధ్యారాణి

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్, రామారావుపల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యులుగా చేరడం ద్వారా పార్టీ సిద్ధాంతాలకు మద్దతు ఇవ్వడమే కాకుండా దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే అవకాశాన్ని పొందుతారన్నారు. నాయకులు పిడుగు కృష్ణ, జటిపట్ తిరుపతి, వాసాల పద్మ, కన్నం వెంకటేశ్, కందుల పోచం, మహేశ్ పాల్గొన్నారు.

పంచాయతీకి వీధిలైట్లు, సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న మెండె రాజయ్య

మంథని: మండలంలోని కాకర్లపల్లి గ్రామపంచాయతీకి కాంగ్రెస్ నాయకుడు మెండె రాజయ్య వీధిలైట్లు, విద్యుత్ సామగ్రి అందించారు. బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణకు తనవంతుగా సాయం అందించినట్లు రాజయ్య తెలిపారు. బతుకమ్మ నిమజ్జనానికి చెరువు వద్దకు వెళ్లడానికి చీకటిలో గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సామగ్రి అందించానని రాజయ్య పేర్కొన్నారు. కనవేన ఓదెలు, తన్నీరు లక్ష్మణ్, కుమారస్వామి, బాస్కర్ల శంకరయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన భూషణవేన లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్లో 1999–2000లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితుడు లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు శనివారం రూ.25వేలు అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పొత్కపల్లి సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో సొసైటీ భవనం, గోదాములను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు, ఫర్టిలైజర్స్ పంపిణీకి ఓదెల, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లో గోదాముల నిర్మాణాలకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కేడీసీసీ బ్యాంకు కరీంనగర్ చైర్మన్, అఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, జిల్లా డీసీవో శ్రీమాల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సీఈవో గోళి అంజిరెడ్డి, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ బొంగోని రాజయ్య గౌడ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కటింగ్ ఉండదు

కాల్వశ్రీరాంపూర్: ఆరుగ్యారంటీలు పక్కాగా అమలు చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో శనివారం 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐకేపీ, సింగిల్ విండో కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కటింగ్‌లు ఉండబోవని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎండీ వకీల్, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, డిటి శంకర్, ఆర్‌ఐలు అజీమ్, రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు లంక సదయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వామ్మో.. వానరసేన



చిన్నారి నుంచి చిప్స్ ప్యాకెట్ లాక్కున్న కోతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ ఆఫీసు ఆవరణలోని ఎంఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు శనివారం కోతి చేష్టలతో బెంబేలెత్తిపోయారు. ఎంపీడీవో ఆఫీసుకు పనుల నిమిత్తం వచ్చిన వారు నిలిపి ఉంచిన బైకు కవర్లను వానరసైన్యం చించిపారేశాయి. ఇదే కార్యాలయంలో ఓ అభ్యర్థిని తన పిల్లలకు చిప్స్ తినిపిస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన కోతి లాక్కొని కొద్ది దూరంలో కూర్చుని తినేయడాన్ని చూసి అందరూ నవ్వుకున్నారు.

దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు



పెద్దపల్లిరూరల్: హన్మంతునిపేటలో..



ఎల్కలపల్లి: అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

ఫెర్టిలైజర్‌సిటీ/కాల్వశ్రీరాంపూర్/ముత్తారం/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/ఎలిగేడు/జూలపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత మండపాలలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాతకు మూడోరోజు అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామగుండం: అంతర్గాం పీహెచ్‌సీలో..



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

సుల్తానాబాద్/గోదావరిఖనిటౌన్/రామగుండం/గోదావరిఖనిటౌన్/పెద్దపల్లిరూరల్/ముత్తారం: సుల్తానాబాద్, గోదావరిఖని, ముత్తారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో, అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: మారుతున్న సాంకేతిక ఆధునిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి అంతర్గాం మండల కేంద్రంలోని రైతుభవన్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వరిపొలంలో రసాయనిక ఎరువులు పిచికారీ చేసేందుకు డ్రోన్లు వినియోగించుకునే స్థాయికి వచ్చినప్పటికీ మరింత అడ్వాన్సు ఆధునికతను ప్రతీ రైతు అలవర్చుకోవాలి.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ అన్నప్రసన్న మాట్లాడుతూ ఈశ్వరకృప వృద్ధాశ్రమ నిర్వాహకులను అభినందించారు. వైద్యులు సరళి, కోఆర్డినేటర్ పారిజాతం, వృద్ధాశ్రమ నిర్వాహకులు పిటి స్వామి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో శుక్రవారం పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న బూడిద లారీలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనాలపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ సూచించారు.

సులభ్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలి

గోదావరిఖని: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సులభ్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించి జీఎం ఎల్‌వీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో సుమారు 200కు పైగా సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, వాటిలో 200 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కాంటాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇస్తున్నట్టుగానే సులభ్ కార్మికులకు కూడా లాభాల వాటా ఇవ్వాలని కోరారు. నాయకులు బుచ్చమ్మ, లలిత, రమేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలి



యంత్రాన్ని నడిపిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: నూతన యంత్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. జీడీకే–11వ గనిలో మూడు నూతన ఎల్‌హెచ్‌డీ యంత్రాలను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాత యంత్రాల మూలంగా తరచూ మరమ్మతుతో బ్రేక్‌డౌన్‌లు వచ్చి ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు. సంస్థ సీఅండ్‌ఎండీ బలరాం చొరవతో నూతన యంత్రాలను గనికి అలాట్ చేశారని పేర్కొన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు, సూపర్‌వైజర్ల విశ్రాంతి గదులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోచం, అధికారులు శ్రీనివాస్, మల్లేశం, రాందాస్ పాల్గొన్నారు.

రీజినల్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మెడికల్ సూపరింటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రీజినల్ స్థాయి క్రీడాపోటీలను ఆర్జీ–3 మెడికల్ సూపరింటెండెంట్ డా.కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. సెంటనరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ–3, ఏపీఏ, భూపాలపల్లి రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్ పోటీలే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏటా వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. కంపెనీ, కోల్‌ఇండియా స్థాయి పోటీల్లో నైపుణ్యం సాధించి రీజియన్ పేరు నిలబెట్టాలన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్శ శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.వి.నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ జమచేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బొగ్గు గని రిటైర్డ్ కార్మికుల ఖాతాల్లో పెన్షన్ వెంటనే జమ చేయాలని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి డిమాండ్ చేశారు. భాస్కర్‌రావుభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌బీఐ ధన్‌బాద్ బ్రాంచి యూబీఐ బ్యాంకులో పెన్షన్ జమ చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని వారు ఖండించారు. ఐదురోజులు గడిచినా రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ అందలేదన్నారు. కేంద్ర బొగ్గు గనులశాఖ అధికారులు స్పందించి సోమవారంలోగా పెన్షన్ జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆరెల్లి పోషం, చెప్యాల మహేందర్, రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ–1, 2 జీఎం కార్యాలయాల్లో కాకా జయంతి



నివాళి అర్పిస్తున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్



నివాళి అర్పిస్తున్న ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను శనివారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మిబాయి, పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

కాకా జయంతిని శనివారం ఆర్జీ–2 ఏరియాలో కాకా చిత్రపటానికి జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు జీగురు రవీందర్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, సురేశ్‌బాబు, వెంకటరామచంద్ర పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే

గోదావరిఖని: సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.33వేల కోట్ల బకాయిలు ఇప్పించాల్సిన బాధ్యత కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలపై ఉందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారాఉ. ఆర్జీ–2 ఏరియా ఏరియా వర్క్‌షాప్‌లో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థలో రాజకీయ జోక్యం పెరిగి పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు రవీందర్, అన్నారావు, సాంబశివరావు, నారాయణ, సంజీవ్, కుమారస్వామి, శంకర్, రమేశ్, సతీశ్, మహేందర్ పాల్గొన్నారు.

నాలుగో డివిజన్ సమస్యలు పరిష్కరించండి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పాలకులు, అధికారులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రామాచారి డిమాండ్ చేశారు. నాలుగో డివిజన్ సీపీఎం శాఖ మహాసభలో శనివారం ఆయన పాల్గొని సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం డివిజన్ శాఖ కార్యదర్శిగా పి.నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

‘కాకా’ జయంతి వేడుకలు



రామగిరి: నివాళి అర్పిస్తున్న జీఎంలు ఎన్.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు

పెద్దపల్లిరూరల్/రామగుండం/గోదావరిఖనిటౌన్/ఎలిగేడు/యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/రామగిరి/కమాన్‌పూర్/మంథని/ఓదెల: పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎంపీ, కేంద్రమాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ, అభిమానుల ఆధ్వర్యంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

జూలపల్లి: రైతులు అధిక లాభాలతో పాటు ఎన్నో ప్రయోజనాలు అందించే ఆయిల్‌పాం సాగుపై దృష్టిపెట్టాలని ఆయిల్ పాం ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్ సూచించారు. మండలంలోని తెలుకుంట రైతువేదికలో ఆయిల్‌పాం సాగు రైతులకు అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

• ఎన్టీపీసీ మౌదాలో ఐఎన్టీయూసీ విజయం

జ్యోతినగర్: ఎన్టీపీసీ మౌదా ప్రాజెక్టులో ఐఎన్టీయూసీ ఘనవిజయం సాధించినట్లు ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. మహారాష్ట్రలోని మౌదా ఎన్టీపీసీ ప్రాజెక్టులో గురువారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఐఎన్టీయూసీ అగ్రభాగాన నిలవడంతోనే ఎన్నికల్లో విజయం సాధించినట్లు స్పష్టం చేశారు. అనంతరం ప్రాజెక్టు గుర్తింపు యూనియన్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా బాబర్ సలీంపాషా, ప్రధాన కార్యదర్శిగా ప్రణయ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజిత్ రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

• లాభాల వాటాపై అనవసర రాద్ధాంతం

గోదావరిఖని: సింగరేణి లాభాల వాటా విషయంలో అనవసర రాద్ధాంతం తగదని ఐఎన్‌టీయూసీ నేత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవ లాభాల్లో సంస్థ అభివృద్ధి, కొత్తగనుల కోసం బడ్జెట్ మినహాయించి మిగతా లాభాల్లో 33శాతం కార్మికులకు ప్రకటించారన్నారు. ఈ విషయంలో టీబీజీకేఎస్ అనవసర ప్రచారం చేస్తోందని విమర్శించారు. కార్మిక హక్కుల సాధనలో తమ యూనియన్ రాజీలేకుండా ముందుకు సాగుతోందన్నారు. నాయకులు ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, దాస్, సదానందం, కృష్ణ, శ్రీనివాస్, పుట్ట రమేశ్ పాల్గొన్నారు.

• ఎంఈవోగా బాధ్యతలు స్వీకరణ

ఎలిగేడు: ఎలిగేడు మండల విద్యాధికారిగా సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎ.నరేంద్రచారి శనివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు నరేంద్రచారికి డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి, ఎంఈవోలు టి.సురేందర్, రాజయ్య, రమేశ్ మహేశ్, మండల స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, డీటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

• ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలోని ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.వెయ్యి ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద రామగుండం, పాలకుర్తి మండలాల ఆటోయూనియన్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి, రామగుండం ఆటోయూనియన్‌ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్, నాయకులు రవి, కాసిపేట రాజయ్య, రేణిగుంట సురేశ్, జబ్బార్ పాల్గొన్నారు.

• ఆంజనేయస్వామికి వెండితోరణం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ఉన్న భక్త ఆంజనేయస్వామి విగ్రహానికి సిద్దిపేట వాస్తవ్యులు తొడుపునూరి శ్వేత హరిశంకర్ వెండి తోరణం బహూకరించారు. శనివారం భక్త ఆంజనేయస్వామికి వడమాల, తులసి మాల, జిల్లెడు మాల పూలమాలలు పుష్పాలంకరణ చేశారు. శివాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, స్రవంతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

• తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యులకు అప్పగింత

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్నకాలనీకి చెందిన బాలుడు తప్పిపోయి కాలనీలో తిరుగుతుండగా మున్సిపల్ సిబ్బంది గమనించి శనివారం మున్సిపల్ కార్యాలయానికి తీసుకువచ్చారు. కాగా కుటుంబ సభ్యులు గాలిస్తున్నారన్న సమాచారం మేరకు మున్సిపల్ సిబ్బంది వారికి సమాచారం చేరవేశారు. తప్పిపోయిన అబ్బాయి స్వప్నకాలనీకి చెందిన గసికంటి రేవంత్–మౌనికల కుమారుడు కావడంతో బాలుడిని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు వారికి అప్పగించారు.

• మాలధారణ స్వాములకు అన్నదానం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని శ్రీదుర్గామాతా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత మాలాధారణ స్వాములకు మండప ప్రాంగణంలో అన్నదానం చేశారు.

• ఆర్థిక సంక్షోభంలో సింగరేణి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని సీఐటీయూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జనరల్ సెక్రటరీ మంద నరసింగరావు అన్నారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు నరహరిరావు, ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వెంకన్న, రాంప్రసాద్, నరసింహ, శ్రావణ్, వినేష్, రాకేశ్, రాజేశం, మహేందర్, సునీల్ పాల్గొన్నారు.

• అవయవదానానికి ముందుకు రావాలి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన గోలి చినచంద్రయ్య ఇటీవల మృతి చెందాడు. సదాశయ ఫౌండేషన్ సభ్యుల విన్నపం మేరకు మృతుడి కుటుంబ సభ్యులు చినచంద్రయ్య చినచంద్రయ్య నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా మృతుడి సంస్మరణ సభ నిర్వహించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సదాయ ఫౌండేషన్ నేతృత్వంలో మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, తహసీల్దార్ ఎండీ వకీల్ శనివారం ప్రశంస పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.